డిప్యూటీ స్పీకర్ బెంగళూరుకు తరలింపు

బెంగళూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ జిల్లా హిరియూరు తాలూకా జవనగొండనహళ్ళి సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురైన డిప్యూటీ స్పీకర్ రుద్రప్ప లమాణిని ఉన్నత చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. హిరియూరులో శుక్రవారం సాయంత్రం ప్రాథమిక చికిత్స అందించి, తర్వాత దావణగెరెలోని శ్యామనూరు శివశంకరప్ప మెడికల్ కళాశాలకు పంపారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న లమాణిని శనివారం ఉదయం బెంగళూరులోని అపోలో ఆసుపత్రికి తీసుకొచ్చారు. అతడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు.



మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు సీఎం

వ్యూహం

15 మందికి ఉద్వాసన తప్పదా..?

- వివాదాలకు కారణమైన వారికి చెక్ పెట్టే యోచన
- రెండేళ్ల పాలన సంబరాలకు డీసీఎం కసరత్తు
- ప్రాబల్యం చాటుకునేందుకే డీకే ప్రయత్నాలు
- శాఖ మార్చాలని రామలింగారెడ్డి డిమాండ్

బెంగళూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మంత్రి వర్గ పునర్ వ్యవస్థీకరణతో తన బలాన్ని చాటుకోవాలని సీఎం వ్యూహం పన్నుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు అవుతున్న సందర్భంలోనే భారీగా మార్పులు ఉంటాయనే అంశం విధానసౌధలో హల్‌చల్ చేస్తోంది. నాయకత్వ మార్పు అంశం కొంతకాలంగా చర్చలకు విమర్శలకు కారణమవుతున్న తరుణంలోనే తరచూ వివాదాలకు కేంద్రబిందువులుగా మారుతున్నవారిని పక్కనపెట్టే విషయం ప్రధానమవుతోంది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరపాలని ముఖ్యమంత్రి సిద్ద రామయ్య భావిస్తుండగా రెండేళ్ళ పాలనపై భారీగా సంబరాలు చేసేందుకు డీసీఎం డీకే శివకుమార్ కసరత్తు చేస్తున్నారు. 2023 మే 23న సిద్దరామయ్య నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ఎన్నికల హామీల్లో భాగంగా ఐదు గ్యారెంటీ పథకాలు ప్రభుత్వం అమలు చేస్తోంది. గ్యారెంటీలు అమలు చేస్తామని దేశంలోని పలు రాష్ట్రాల్లో పార్టీలు హామీలు ఇచ్చాయి. అయితే ఏడాది, రెండేళ్లకే సంపూర్ణంగా అమలు చేయలేక మెలికలు పెట్టిన సందర్భాలు ఉన్నాయి. తెలంగాణలో ఏడాది క్రిందట సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. అంతలోనే పథకాలు భారం అవుతున్నాయని స్వయంగా సీఎం ప్రకటించారు. అయితే రెండేళ్లపాటు సంపూర్ణంగా ఐదు గ్యారెంటీలను అమలు చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కింది. ఇలా ప్రజలకు ఇచ్చిన హామీలలో వెనుకాడేది లేదనే రీతిలో కొనసాగిస్తున్నారు. ఖజానాకు భారం అయినా, ఆర్టీసీకి వందల కోట్ల రూపాయలు నష్టం వచ్చినా ఢోకా లేదని పథకాలు కొనసాగిస్తున్నారు.

బలం చాటుకోవడమే డీకే లక్ష్యం



కేపీసీసీ అధ్యక్షుడిగా ఐదేళ్ల వ్యవధిని ముగించిన డీకే శివకుమార్ రెండురోజుల క్రిందట మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు విందు ఇచ్చారు. ఇదే సందర్భంలోనే రెండేళ్ల పాలన సంబరాలను ఆడంబరంగా జరపాలని చర్చించినట్లు తెలుస్తోంది. సంబరాల ద్వారా తన ప్రాబల్యాన్ని చూపాలని డీకే శివకుమార్ భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ రెండేళ్లక్రితం దావణగెరెలో సిద్దరామోత్సవ సభ, ఇటీవల కొన్ని నెలలక్రితం చిత్రదుర్గలో కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ సభ విజయవంతం చేశారు. ఈ రెండు సభలు సిద్దరామయ్య వర్గానికి అనుకూలమయ్యాయి. రెండేళ్ల సంబరాలను భారీగా జరపాలని డీసీఎం ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. సీఎం, డీసీఎంలు తరచూ తమ మధ్య విభేదాలు లేవని, కలసి ఉన్నామని చెప్పుకొంటున్నా ఎవరికి వారుగా అవకాశాలకు అనుగుణంగా వ్యూహాలు పన్నుతున్నారు. రెండేళ్ల పాలనలోగానే మంత్రివర్గం పునర్వ్యవస్థీకరణ జరపాలనే ఆలోచనలో సీఎం సిద్దరామయ్య ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవలే మంత్రుల పనితీరుపై అధిష్ఠానం పలు సూచనలు చేసిన విషయం తెలిసిందే. ఏకంగా 15మంది మంత్రులను తప్పించి కొత్త వారికి అవకాశం ఇవ్వదలిచినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మంత్రులపై ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారు. ఆ విషయం కాస్త సీఎల్పీలోనూ రుజువైంది.



ఆదిశేషుడిపై దేవేరుల సమేతుడైన నారసింహుడు

ఆదిశేషుడిపై నారసింహుడు

- దేవేరుల సమేతంగా శ్రీవారి దర్శనం

కదిరి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో భాగంగా కదిరి నరసింహ స్వామి శనివారం శ్రీదేవి, భూదేవిల సమేతంగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యపూజ, హోమం అనంతరం యాగశాల నుంచి బయలుదేరిన శ్రీవారు తిరువీధుల్లో విహరించారు. సంధ్యాసమయంలో దేవేరుల సమేతుడై ఆదిశేషుడిపై దర్శనమిచ్చారు. పక్షం రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో అన్ని ఉత్సవాల్లోనూ నారసింహుడు మాత్రమే దర్శనమిస్తారు. ఒక్క శేషవాహనంపై మాత్రమే అమ్మవార్ల సమేతుడిగా మాడవీధుల్లో విహరిస్తారు. ఈఉత్సవానికి తనకల్లు మండలంలోని కొక్కంటి జ్యోతి రావడం ఆనవాయితీ. బ్రహోత్సవాల్లో కోలాటం, చెక్కభజన భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ ఉత్సవంలో ఆలయ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు సూర్య, చంద్ర ప్రభ వాహనం

శ్రీవారి బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారు సూర్య, చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉదయం వేళ సూర్యప్రభ, రాత్రి సమయంలో చంద్ర ప్రభ వాహనాలపై తిరువీధుల్లోభక్తులకు దర్శనమిస్తారు.



కోలాటం ఆడుతున్న మహిళలు

నాయకత్వ మార్పుపై ఊహాగానాలు..

రాష్ట్రంలో కొన్ని నెలలుగా నాయకత్వ మార్పు అంశం హల్‌చల్ చేస్తోంది. తరచూ సిద్దరామయ్య మరో మూడేళ్లు ముఖ్యమంత్రిగా కొనసాగుతారని పలువురు మంత్రులు బహిరంగంగానే వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈఅంశం డీసీఎం డీకే శివకుమార్‌తో పాటు ఆయన వర్గీయులకు తీవ్ర అసంతృప్తికి కారణమవుతోంది. దీంతో పలుమార్లు అధిష్ఠానం నుంచి అగ్రనేతలు జోక్యం చేసుకోవడంతో పాటు ఆంక్షలు విధించాల్సి వచ్చింది. దీంతో ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ స్వయంగా బెంగళూరుకు వచ్చి పార్టీ అంతర్గత వ్యవహారాలు బహిరంగంగా చర్చించరాదని, మీడియా ముందు మాట్లాడరాదని సున్నితంగా మందలించిన విషయం విదితమే. అయినా కొందరు మంత్రుల తీరులో మాత్రం మార్పు రాలేదు.

వారంక్రిందట ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నాయకత్వ మార్పు విషయమై ఎవరూ మాట్లాడరాదని, సీఎం, డీసీఎంలకు సూచించిన విషయం తెలిసిందే. పార్టీ జాతీయ అధ్యక్షుడికి గౌరవంతో ఆ అంశంపై మాట్లాడేది లేదని డీకే శివకుమార్ తెలిపారు.

రవాణా శాఖ మార్చాల్సిందే..

దేవదాయ, ధర్మాదాయశాఖ, రవాణాశాఖల మంత్రిగా ఉన్న రామలింగారెడ్డి శాఖ మార్పుకు ఒత్తిడి తెచ్చినట్లు తెలుస్తోంది. శాసనసభ బడ్జెట్ సమావేశాలు ముగియగానే మంత్రివర్గ విస్తరణ ఉంటుందనే అంశం బలాన్నిస్తోంది. ప్రస్తుతం రామలింగారెడ్డి రెండు శాఖలమంత్రిగా వ్యవహరిస్తున్నారు. వాటిని వదులుకుని మరోశాఖపై ఆలోచన పెట్టుకున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే సీఎం సిద్దరామయ్య వద్ద శాఖ ప్రస్తావన తెచ్చినట్టు తెలుస్తోంది. శక్తిగ్యారెంటీ పథకం ద్వారా రవాణా శాఖకు భారీగా నష్టం వాటిల్లింది. బడ్జెట్‌లోనూ ఆశించినంత పరిహారంగా గ్రాంటు కేటాయించలేదు. ఇదేశాఖను మరింత కాలం కొనసాగిస్తే చెడ్డపేరు తప్ప సాధించేది ఉండదని, శాఖను మార్పు చేయాలని కోరినట్లు తెలుస్తోంది. రెండురోజులక్రిందటే మంత్రి ఆర్టీసీ నాలుగు కార్పొరేషన్లకు 5,200 కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని ప్రకటించారు.



మంత్రి జమీర్ వర్గానికి షాక్..!

- వక్ఫ్‌బోర్డు ఛైర్మన్‌గా సయ్యద్ అలీ హుస్సేన్

బెంగళూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌శాఖ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్‌కు వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ నియామకంలో షాక్ తగిలింది. అధ్యక్షుడి నియామకానికి సంబంధించి కాంగ్రెస్‌లోని రెండు గ్రూప్‌లు పోటీ పడ్డాయి. చిత్రదుర్గకు చెందిన అన్వర్‌పాషాను అధ్యక్షపదవికి ఎంపిక చేయాలని, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను మంత్రి జమీర్ కోరారు. అయితే కలబురగికి చెందిన హజరత్ ఖ్వాజాబందానవాజ్ దర్గాకు చెందిన సయ్యద్ మహ్మద్‌అలి హుస్సేన్‌ని అధ్యక్షుడిగా ప్రకటించారు. ఇతడు రాజ్యసభ సభ్యుడు నాసిర్ హుస్సేన్‌కు ఆప్తుడిగా గుర్తింపు పొందిన వారు. మంత్రి జమీర్ అహ్మద్ సూచించిన వ్యక్తికి వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ హోదా దక్కకపోవడంపై ఆయన వర్గీయులలో అసంతృప్తి నెలకొంది. రెండున్నరేళ్లపాటు సయ్యద్ అలి హుస్సేన్ వక్ఫ్ బోర్డు ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు.



మల్లికార్జున ఖర్గేతో సయ్యద్‌అలి హుస్సేన్

అంతర్జాతీయ ఈత పోటీలకు ఎంపిక

బళ్లారి సిటీ,మార్చి 15(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పారా స్విమ్మింగ్ పోటీలకు బళ్లారి క్రీడాకారులు ఎంపికయ్యాయరు. మార్చి 17నుంచి 23వరకు స్పెయిన్‌లోని బార్సిలోనాలో జరగనున్న పారా స్విమ్మింగ్ వరల్డ్ సిరీస్ స్విమ్మింగ్ పోటీలకు బళ్లారికి చెందిన గోపిచంద్, సాయినిఖిల్ ఎంపికయ్యారు. 2022లో జరిగిన ఆసియా పారా స్విమ్మింగ్‌లో గోపిచంద్ ఇప్పటికే 6వ, 7వ స్థానాల్లో నిలిచాడు. సాయినిఖిల్ రాష్ట్ర , అంతర్జాతీయ ఈత పోటీల్లో పాల్గొన్నారు. పారా కమిటీ ఇండియా ఈ ఇద్దరు పోటీదారులను ఎంపిక చేసిందని కోచ్‌లు రజనీలక్క, శరత్ గైక్వాడ్ తెలిపారు. నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రశాంత్ కుమార్‌మిశ్రా, ఎస్పీ శోభరాణి, జడ్పీ సీఈఓ మహ్మద్ హారీస్ సుమైర్, ఏడీసీ మహమ్మద్ జుబేర్, యువజన సాధికారత , క్రీడా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గ్రేషీ తదితరులు వారికి అభినందనలు తెలిపారు.



పోటీలకు ఎంపికైన గోపీచంద్, నిఖిల్‌కుమార్

సెలవుపై వెళ్లండి..

- డీజీపీ రామచంద్రరావుకు ప్రభుత్వం ఆదేశాలు

బెంగళూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): నటి రన్యారావ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సవతి తండ్రి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డీజీపీ రామచంద్రరావును తప్పనిసరి సెలవుపై వెళ్లాలని ప్రభుత్వం శనివారం ఆదేశాలు జారీ చేసింది. ఆయన నిర్వహిస్తున్న పోలీస్ హౌసింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు ఏడీజీపీ రిక్రూట్‌మెంట్ విభాగం అధికారి కేవీ శరత్‌చంద్రను నియమించారు. కాగా రన్యారావ్ వివాదంలో ఆమె కారు డ్రైవర్ దీపక్‌ను అరెస్టు చేశారు. 27 సార్లు దుబాయ్ నుంచి అక్రమంగా బంగారం రవాణా చేసినట్లు ఆమె ఆరోపణలు ఎదుర్కొంటోంది. కోర్టు ఆదేశాల మేరకు ఆమె జ్యూడిషియల్ కస్టడీలో కొనసాగుతున్నారు. చిక్కమగళూరు జిల్లా హొసమనె లే అవుట్‌కు చెందిన దీపక్‌ను అరెస్టు చేశారు. కాగా ఈ వివాదంలో రన్యారావ్‌కు వ్యతిరేకంగా మీడియా ఎటువంటి పరువునష్టం కలిగించే కథనాలు ప్రకటించరాదని బెంగళూరు 41వ అదనపు సిటీ సివిల్ సెషన్స్ కోర్టు ఆదేశించింది. 35 మీడియా సంస్థలకు నిషేధం విధించారు. రన్యారావ్ సవతి తండ్రి, ఐపీఎస్ రామచంద్రరావుకు సంబంధించి పరువు నష్టం కలిగించే కథనాలు ప్రచురించరాదని హైకోర్టు సూచించింది.



మేయర్ మంగేశ్ పవార్, డిప్యూటీ మేయర్ వాణివిలాస్ జోషి

బెళగావి మేయర్‌గా మరాఠా నేత మంగేశ్

- అనూహ్యంగా మద్దతు పలికిన కార్పొరేటర్లు

బెంగళూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): బెళగావి మహానగరసభ 23వ మేయర్‌గా మంగేశ్ పవార్, ఉపమేయర్‌గా వాణివిలాస్ జోషిలు శనివారం ఎన్నికయ్యారు. మేయర్ పదవి జనరల్, ఉపమేయర్ పదవి మహిళలకు రిజర్వేషన్ చేశారు. 40మంది సభ్యులు ఉన్న బీజేపీలో మరాఠీ సామాజికవర్గానికి చెందిన మంగేశ్ ఎన్నికయ్యారు. మంగేశ్ పవార్, రాజు భాతఖాండె, ఎంఈఎస్‌కు చెందిన బసవరాజ్ మారుతి మోదగేకర్, ఎంఐఎం తరపున శాహిద్‌ఖాన్ పఠాన్‌లు రెండేసి సెట్‌ల చొప్పున నామినేషన్ వేశారు, మంగేశ్‌కు మద్దతుగా 40 ఓట్లు దక్కాయి. బసవరాజ్‌కు 20 ఓట్లు వచ్చాయి. ఉపమేయర్ స్థానానికి వాణివిలాస్ జోషితోపాటు మరో ముగ్గురు నామినేషన్‌లు వేశారు. 65మంది కార్పొరేటర్లకు గాను 60మంది హాజరయ్యారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో భార్య పేరిట గది పొందారనే ఆరోపణలతో మంగేశ్ పవార్‌పై అనర్హత వేటు పడింది. కొంతకాలం పార్టీకి దూరంగా గడిపారు. అనూహ్యంగా ఎన్నికల్లో పార్టీ కార్పొరేటర్‌లు మద్దతు పలికారు. మళ్లీ పదవి దక్కడంతో ఆయన వర్గీయుల్లో ఆనందం నెలకొంది. మేయర్ మంగేశ్‌ను ఎంపీ జగదీశ్‌శెట్టర్, ఎమ్మెల్యే అభయ్‌పాటిల్, ఎమ్మెల్సీ సాబణ్ణ తదితర పార్టీ నాయకులు అభినందించారు.

మహిళల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

- గర్భసంచి క్యాన్సర్ బాధితులకు ప్రత్యేక చికిత్స
- త్వరలో వైద్యశాఖలో ఖాళీల భర్తీ
- మంత్రి దినేశ్ గుండురావ్

రాయచూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): విద్య, ఆరోగ్య రంగాలకు అధిక ప్రాధాన్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకించి మహిళల ఆరోగ్య రక్షణ కోసం అనేక కార్యక్రమాలను చేపట్టినట్లు రాష్ట్ర వైద్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావ్ తెలిపారు. అందులో భాగంగానే త్వరలోనే 16 ఏళ్లు పైబడిన మహిళలందరికి గర్భసంచి క్యాన్సర్ నియంత్రించేందుకు చుక్కల మందు పంపిణీ చేసేందుకు నిర్ణయించామన్నారు. శనివారం జిల్లాలోని మాన్వి పట్టణం బాశుమియా సాహుకార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన మెగా ఆరోగ్య మేళాలో మంత్రి పాల్గొని మాట్లాడారు. కల్యాణ కర్ణాటక ప్రాంతంలో మహిళల అపౌష్టికతతో పాటు బర్భసంచి క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్‌ల సమస్య తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం వాటి నివారణకు ప్రత్యేక కార్యచరణ చేపట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి పూర్తి సహకారం అందించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆరోగ్య పథకాన్ని జాతీయ పథకంగా గుర్తించి ప్రోత్సహించాలని మంత్రి కోరారు. సమావేశంలో మాట్లాడిన రాష్ట్ర చిన్ననీటి పారుదల శాఖ మంత్రి ఎస్.ఎస్.భోసరాజు, కల్యాణ కర్ణాటక ప్రాంతంలో ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం ఇప్పటికే 40 కొత్త ఆస్పత్రులకు శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లాలో కొత్తగా ఒపెక్ ఆస్పత్రిలో క్యాన్సర్ విభాగం అభివృద్ధికి ప్రభుత్వం రూ.52 కోట్లు విడుదల చేసిందన్నారు. కల్యాణ కర్ణాటక అభివృద్ధి బోర్డు ద్వార చేపట్టే కార్యక్రమాల్లోను విద్యకు, వైద్యానికి తాము అధిక ప్రాధాన్యమినిస్తున్నట్లు మంత్రి భోసరాజు వివరించారు.

ఖాళీల భర్తీకి చర్యలు

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పూర్తి స్థాయిలో వైద్యులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. అనేక



మెగా ఆరోగ్యమేళాను ప్రారంభిస్తున్న మంత్రి దినేశ్ గుండురావ్

చోట్ల నిపుణులైన డాక్టర్‌ల కొరత ఉన్నందున తక్షణం ప్రభుత్వం నిపుణుల నియామకం కోసం చర్యలు తీసుకుంటుందన్నారు. కాగా రాయచూరు, బళ్ళారి, యాదగిరి జిల్లాలో ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపద్యంలో వైద్య ఆరోగ్య శాఖను ఇప్పటికే అప్రమత్తం చేసినట్లు మంత్రి తెలిపారు. ముఖ్యంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజలకు తగిన సూచనలు ఇచ్చేలా అధికారులను ఆదేశించామన్నారు. ముఖ్యంగా పాఠశాలలు, విద్యసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే వారికి ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేలా తగిన సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉద్యోగులు, విద్యార్థులు, ఇతరత్ర సంస్థల్లో పని చేసేవారు ఎండతీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



మాన్వి పట్టణంలో మెగా ఆరోగ్యమేళాకు తరలివచ్చిన ప్రజలు

రిజర్వేషన్లు అమలైతే 74మంది మహిళలకు అవకాశం

- కాంగ్రెస్‌లోనే అధిక సంఖ్యలో మహిళా ఎమ్మెల్యేలు: ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్

బెంగళూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మహిళా రిజర్వేషన్ అమలైతే వచ్చే శాసన సభ ఎన్నికల్లో 74మంది మహిళా ఎమ్మెల్యేలు అవకాశం పొందుతారని డీసీఎం డీకే శివకుమార్ అభిప్రాయపడ్డారు. కేపీసీసీ భారత్‌జోడో భవన్‌లో శనివారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సౌమ్యారెడ్డి అధ్యక్షత వహించగా మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీకే శివకుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ మహిళా విభాగం వచ్చే ఎన్నికల నాటికి 74మంది అభ్యర్థులను సిద్ధం చేసే తరహాలో ప్రగతి సాధించాలన్నారు. రాష్ట్రంలో కోట్లాదిమంది మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వ గ్యారెంటీలు అందుతున్నాయన్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు శక్తినిచ్చామన్నారు. ఇంటి పట్టాలు, హౌసింగ్ లబ్ధిదారులు మహిళలను చేయాలనేది మా ఆశయమన్నారు. కనకపురలో 7వేలమందికి ఇంటి పట్టాలు ఇచ్చామని అందుకే 30వేల ఓట్ల మెజారిటీతో గెలిపించారన్నారు. 18 నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల్లో 15 చోట్ల ఓటమి చెందామని అయితే అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక పార్టీని పటిష్టం చేశామన్నారు. రెండేళ్లక్రితం ఎన్నికల్లో 134మంది ఎమ్మెల్యేలను గెలిపించామన్నారు. పార్టీకి మహిళలు మరింత శక్తినిచ్చేలా పనిచేయాలని సూచించారు. 50మందిని సభ్యులుగా చేర్పితే పార్టీలో పదవి ఇస్తామన్నారు. స్త్రీ అంటే త్యాగానికి ప్రతీక అని, సోనియాగాంధీ దేశం కోసం ఎన్నో త్యాగాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు చంద్రశేఖర్, వినయ్‌కుమార్ సొరకె, హెచ్‌ఎం రేవణ్ణ తదితరులు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా అట్లాంటికా సముద్రంలో ఒంటరిగా రోయింగ్ ద్వారా 52 రోజులపాటు 4,800 కిలోమీటర్ల మేర ప్రయాణం చేసిన జాతీయ కవి జీఎస్ శివరుద్రప్ప మనవరాలు అనన్యప్రసాద్‌ను డీకే ప్రత్యేకంగా సత్కరించారు.



అనన్యప్రసాద్‌ను సత్కరిస్తున్న డీసీఎం డీకే శివకుమార్ తదితరులు

చేనేత వస్త్రాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

- రాష్ట్ర చేనేత సమాఖ్య అధ్యక్షుడు బీజే గణేశ్



మగ్గం నేస్తున్న బీజే గణేశ్



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సెహరీ
6.46	5.15
ఆదివారం సాయంత్రం	సోమవారం ఉదయం

పది విద్యార్థులకు ఉచిత ప్రయాణం



ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్.ఆదోని

అనంతపురం కల్చరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఈ నెల 17వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు సంస్థ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్. ఆదోని తెలిపారు. ఈ మేరకు శనివారం తన చాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ ప్రాంతం నుంచి పరీక్షాకేంద్రం వరకు, పరీక్ష ముగిశాక తిరిగి తమ ప్రాంతం వరకు పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు అన్నారు. స్టూడెంట్ బస్‌పాస్ లేని పదోతరగతి విద్యార్థులు సైతం ఒరిజినల్ హాల్‌టికెట్‌ను కండక్టర్‌కు చూపి రీజియన్‌లోని అన్ని డిపోల పరిధిలోనూ ఉచితంగా ప్రయాణించవచ్చునని తెలిపారు. సోమవారం నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు మాత్రమే ఈ అవకాశం కల్పించామని, పదోతరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అందరి సహకారంతో స్వచ్ఛాంధ్ర: మంత్రి సవిత



చీపురు పట్టి రోడ్లు ఊడ్చుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల సహకారంతోనే గ్రామాల నుంచి పట్టణాల వరకు పరిశుభ్రత నెలకొంటుందని మంత్రి సవిత పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం పెనుకొండలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. నగర పంచాయతీ కార్మికులు, ఎన్డీఏ కూటమి నాయకులు పలువురు ప్రజలతో కలిసి దర్గాసర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి స్వచ్ఛభారత్‌పై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం చీపురుపట్టి రోడ్లు ఊడ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో చెత్తపై పన్ను వేసి ప్రజలను ఇబ్బంది పెట్టడంతోపాటు చెత్త తరలించడంలో అశ్రద్ధ వహించారని విమర్శించారు. అదే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెత్తపై పన్ను రద్దు చేయడంతో పాటు సంపద సృష్టిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సతీష్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, రమేష్‌బాబు, కన్వీనర్ శ్రీరాములు, నాయకులు చిన్నవెంకటరాముడు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులాల్లో 5,6,7,8,9 తరగతుల్లో ప్రవేశాల దరఖాస్తు గడువు పొడిగించినట్లు ఆ గురుకులాల జిల్లా కన్వీనర్ జోనతన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇది వరకూ ఈ నెల 15వ తేదీ చివరి గడువుగా ఉండేదని, దాన్ని ఈ నెల 25 వరకూ పొడిగిస్తున్నామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో https://mjpapbcwreis.apcfss.in వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 20న జరిగాల్సిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ప్రవేశ పరీక్షను మే ఐదో తేదీకి మార్చినట్లు తెలిపారు.

ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీ ఫార్మసీ, ఫార్మా-డీ, ఎంఫార్మసీ, ఎంటెక్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు తెలిపారు. బీఫార్మసీ ద్వితీయ సంవత్సరం ప్రథమ సెమిస్టర్(25) రెగ్యులర్‌తో పాటు ప్రథమ, ద్వితీయ సెమిస్టర్ (ఆర్15,19) సప్లిమెంటరీ ఫలితాలు విడదల చేశామన్నారు. ఫార్మాడీ ద్వితీయ, తృతీయ, నాలుగో సంవత్సరం(ఆర్17) అడ్వాన్స్, ద్వితీయ సంవత్సరం(ఆర్14), ప్రథమ సంవత్సరం (ఆర్14,17) సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు తెలిపారు. ఎంఫార్మసీ ద్వితీయ, నాలుగో సెమిస్టర్(ఆర్21) సప్లిమెంటరీ, ప్రథమ సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీతో పాటు ఎంటెక్ నాలుగో సెమిస్టర్(ఆర్21) సప్లిమెంటరీ ఫలితాలు విడుదల చేశామని ఆయన తెలిపారు.

కదిరికి చేరిన కొక్కంటి జ్యోతి



కొక్కంటిలో బయలు దేరిన జ్యోతి

తనకల్లు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు తనకల్లు మండలంలోని కొక్కంటి పాలేగాళ్ల జ్యోతి రావడం ఆనవాయితీ. ఆ మేరకు శుక్రవారం రాత్రి కొక్కంటిలో పూజలు నిర్వహించారు. పాలేగాళ్ల వైవీ దినకర్‌ప్రసాద్‌నాయుడు నివాసంలో ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కాలినడక జ్యోతి నల్లచెరువు మండలంలోని పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయం మీదుగా శనివారం కదిరి చేరుకుంది. అక్కడ కొక్కంటి జ్యోతికి ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. ఆలయంలో విడిది కేటాయించారు. ఉత్సవాల్లో కొక్కంటి జ్యోతి ముందుండడం ఆనవాయితీగా కొనసాగుతున్నట్లు కొక్కంటి పాగేళ్ల తెలిపారు.

పరిశ్రమల శాఖ జీఎం బదిలీ

కొత్త జీఎంగా శ్రీనివాస్ యాదవ్

అనంతపురం అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్ శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారు. గత ఏడాది అక్టోబరులో అనకాపల్లి నుంచి ఆయన జిల్లాకు బదిలీపై వచ్చారు. అప్పటి నుంచి తిరిగి వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయన బదిలీ నేపథ్యంలో చిత్తూరు పరిశ్రమ శాఖ జీఎంగా పనిచేస్తున్న శ్రీనివాస్ యాదవ్‌ను జిల్లాకు నియమించారు. రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

పారదర్శక పాలన అందించాలి

జిల్లా ఇన్‌చార్జి అధికారి విజయరామరాజు



మాట్లాడుతున్న విజయరామరాజు

అనంతపురం టౌన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రజలకు పారదర్శక సేవలు అందించాలని పాఠశాల విద్య కమిషనర్, జిల్లా ఇన్‌చార్జి అధికారి విజయరామరాజు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, జిల్లా అధికారులతో శనివారం రాత్రి ఆయన సమీక్ష నిర్వహించారు. పనుల మీద వచ్చిన ప్రజలను సాదరంగా ఆహ్వానించి, గౌరవంగా మాట్లాడాలని సూచించారు. ప్రజలను ఇబ్బంది పెట్టకుండా, వారి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఎంతో ముఖ్యమైనదని, పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఉద్యోగాల సృష్టి ఎంతో గొప్పదని, చట్టప్రకారం వ్యాపారులు వ్యాపారం చేసుకుంటున్నారా లేదా అనేది పరిశీలించాలని అన్నారు. వేసవి నేపథ్యంలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకుని అమలు చేయాలని అన్నారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని, నీటిని రవాణా అవసరం లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. నియోజకవర్గాల్లో ఏపీఐఐసీ కింద పార్కుల ఏర్పాటుకు అవసరమైన భూమి గుర్తించాలని సూచించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను అన్ని పంచాయతీల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. డ్వామా కింద కేటాయించిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు చేరుకోవాలని అన్నారు. నియోజకవర్గానికి ఒక స్కిల్ సెంటర్ ఏర్పాటు చేసుకోవాలని, అన్నిశాఖల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను, ప్రభుత్వ పథకాలను జాగ్రత్తగా అమలు చేయాలని సూచించారు. సమీక్షలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్వో మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, మల్లికార్జున, ఆనంద్, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీమకు నీరివ్వడానికి కృషి: మంత్రి

ముదిగుబ్బ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మలకవేములక్రాస్ వద్ద హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులకు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ధర్మవరం నియోజకవర్గం సహా రాయలసీమ ప్రజలకు తాగు, సాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా కృషిచేస్తోందన్నారు. రూ.936.7కోట్లతో హంద్రీనీవా మెయిన్ కెనాల్ లైనింగ్ పనులు చేపట్టామన్నారు. పట్నం వరకు 184 కిలోమీటర్ల మెయిన్ కెనాల్ లైనింగ్ పనులను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ పనులు పూర్తయిన తరువాత కాలువ ద్వారా నీటి సరఫరా మరింత మెరుగువుతుందన్నారు. పుంగనూరు బ్రాంచ్ కెనాల్ పట్నం నుంచి తనకల్లు మండలంలోని కొక్కంటిక్రాస్ వరకు 75 కిలోమీటర్ల లైనింగ్ పనులను రూ.319.6కోట్ల వ్యయంతో చేపడుతున్నామన్నారు. ఈ పనులను త్వరగా పూరిర్తీ చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేశ్, ప్రాజెక్టు మేనేజర్ వెంకటరావు, బీజేపీ మండల అధ్యక్షుడు అంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్

లైనింగ్ పనులు రద్దు చేయండి

జలసాధన సమితి నాయకులు



కలెక్టర్‌తో మాట్లాడుతున్న జలసాధన సమితి నాయకులు

హిందూపురం అర్బన్, మార్చి 15, (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు రద్దు చేసి, కాలువ వెడల్పు చేసే విధంగా ప్రభుత్వానికి నివేదికలు పంపాలని కలెక్టర్ చేతన్‌ను జలసాధన సమితి ఉమ్మడి జిల్లా నాయకులు కోరారు. వారు ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్‌ను శనివారం కలిసి వినతి అందించారు. వారు మాట్లాడుతూ కాలువకు సంబంధించి మాల్యాల నుంచి జీడిపల్లి 216 కిలో మీటర్ల వరకు 3850 క్యూసెక్కుల సామర్థ్యం మేర నీరు వదలడానికి రూ. 696 కోట్లు, జీడిపల్లి 216 కిలోమీటర్లు నుంచి 400 కిలో మీటర్లు వరకు కాలువ లైనింగ్ చేయడానికి రూ. 936.7 కోట్లను ప్రభుత్వం జీఓ 404, 405ల ద్వారా విడుదల చేసిందన్నారు. కాలువ లైనింగ్ ద్వారా అధిక ఖర్చు తప్పా ప్రయోజనం ఉండదని తెలిపారు. కార్యక్రమంలో జలసాధన సమితి అధ్యక్షుడు ధనాపురం వెంకటరామిరెడ్డి, ఓపీడీఆర్ శ్రీనివాసులు, గంగిరెడ్డి, జమీల్, సిద్దారెడ్డి, తదితరులు ఉన్నారు.

కాళేశ్వర్ ఆశయ సాధనకు కృషి

షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప



పోలీసు అధికారులకు చెక్కును అందజేస్తున్న శిల్ప

పెనుకొండ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, దివంగత సాయి కాళేశ్వర్ ఆశయ సాధనకు కృషి చేస్తున్నట్లు గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప పేర్కొన్నారు. స్థానిక శివసాయి మందిరం ప్రాంగణంలో సాయికాళేశ్వర్ 13వ వర్ధంతిని గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సీనియర్ న్యాయవాది గురుప్రసాద్, కాళేశ్వర్ తండ్రి సుబ్బారాయుడు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ముందుగా కాళేశ్వర్ సమాధికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో శిల్ప మాట్లాడుతూ కాళేశ్వర్ పేదల సంక్షేమమే ధ్యేయం గా కులమతాలకు అతీతంగా అన్నీ వర్గాల వారికి ఎన్నో సేవా కార్యక్రమా లు చేపట్టారన్నారు. అనంతరం పెనుకొండలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం కోసం పోలీసులకు రూ.28లక్షల చెక్కును అందజేశారు. కంటి ఆసుపత్రిలో ఆపరేషన్ చేసుకున్నవారికి ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ కాళేశ్వర్ మృతి పెనుకొండ ప్రజలకే కాక జిల్లా ప్రజలకు తీరనిలోటన్నారు. కార్యక్రమం లో నాగిరెడ్డి, చిట్టిబాబు, హరి, బాబుప్రసాద్, ప్రగతి శ్రీనివాసులు, మానవహక్కుల జిల్లా అధ్యక్షుడు జాన్ ప్రియనాథ్, ఆశ్రమ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే స్వచ్ఛాంధ్ర

ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మునిప్రసాద్

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణతోనే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర నిర్మాణం సాధ్యమవుతుందని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మునిప్రసాద్ పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా శనివారం స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాల నుంచి ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో గ్రీన్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సప్తగిరిసర్కిల్, సుభాష్‌రోడ్డు మీదుగా క్లాక్‌టవర్ వరకు సాగింది. ఈ సందర్భంగా మునిప్రసాద్ మాట్లాడుతూ వాతావరణాన్ని కలుషితం చేస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నివారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ శ్రీనివాసరెడ్డి, డీఐసీ జనరల్ మేనేజర్ కృష్ణమూర్తి, కార్మికశాఖ, డీఎంహెచ్ఓ కార్యాలయం, నగరపాలక సంస్థనుంచి అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విజయ్‌కుమార్, అనీల్‌కుమార్, టీవీ రెడ్డి, పరిశ్రమల ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



గ్రీన్ ర్యాలీ జెండా ఊపి ప్రారంభిస్తున్న మునిప్రసాద్

నెలాఖరు నుంచి హెచ్చెల్సీ పనులు : ఎస్ఈ

బొమ్మనహాళ్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరు నుంచి హెచ్చెల్సీ అత్యవసర పనులు ప్రారంభం అవుతాయని ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. మండలంలోని క్రిష్ణాపురం, ఉంతకల్లు, షైలాపురం, ఉద్దేహాళ్ గ్రామ సమీపంలోని 126, 105, 109 కి.మీ. వద్ద కాలువ, వంతెనలను శనివారం ఆయన పరిశీలించారు. కాలువలో నీటి ప్రవాహానికి అడ్డంగా లేకుండా చూడాలని స్థానిక అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 105 కి.మీ. నుంచి 189 కి.మీ. వరకు 10 పనులు రూ. 34.95 కోట్లతో జరుగుతాయన్నారు. జూలై నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. బొమ్మనహాళ్ మండలంలో రూ. 16 కోట్ల వ్యయంతో వంతెన, లైనింగ్ పనులు జరుగుతాయని తెలిపారు. నిరంతర పర్యవేక్షణ, పరిశీలన చేసి పనులు నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేఈఈ అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.



హెచ్చెల్సీని పరిశీలిస్తున్న ఎస్ఈ రాజశేఖర్



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబు దంపతులు



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చంద్రబాబు దంపతులు, బీఆర్ నాయుడు



అమరావతిలో.. శ్రీవారి కల్యాణోత్సవం

రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రప్రథమంగా శనివారం శ్రీవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణల మధ్య అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడి కల్యాణాన్ని తిలకించిన భక్తజన సందోహం పరవశించింది. విద్యుత్ వెలుగులతో కల్యాణ ప్రాంగణం కాంతులీనగా భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నుల పండువగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు, గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరుల సమక్షంలో టీటీడీ వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ కైంకర్యాలను నిర్వహించారు.

-తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



చంద్రబాబుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు



వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు



సీఎం చంద్రబాబుకు వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు

ఓ పెళ్లి ప్రయత్నం...

రెండు ఆత్మహత్యలు

మూడు రోజుల వ్యవధిలో కుమారుడు, తల్లి బలవన్మరణం



శైలజ (ఫైల్)



శ్రీచరణ్ (ఫైల్)

తాడిపత్రి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఓ పెళ్లి ప్రయత్నం రెండు ఆత్మహత్యలకు దారి తీసింది. బంధువులు పెళ్లి సంబంధం తల్లి వద్దన్నదని కుమారుడు మూడు రోజుల కిందట ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి నువ్వే కారణమని బంధువుల సూటిపోటి మాటలు అనడంతో కలత చెందిన తల్లి శనివారం ఆత్మహత్య చేసుకుంది. భార్య, కుమారుడి అకాల మృతితో ఏకాకిగా మిగిలిన సురేంద్రబాబు రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి. తాడిపత్రికి చెందిన ఓ కుటుంబ విషాద సంఘటన ఇది. వివరాలు ఇలా.. పట్టణానికి చెందిన శైలజ(42), సురేంద్రబాబు దంపతులకు ఏకైక కుమారుడు శ్రీచరణ్ (20) డిప్లొమా పూర్తిచేసి ఉద్యోగాన్వేషణలో ఉండేవాడు. సురేంద్రబాబు కూలిపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొద్ది రోజుల నుంచి శ్రీచరణ్‌కు పెళ్లి సంబంధాలు చూడటం మొదలుపెట్టారు. బంధువుల్లోనే ఓ సంబంధం ఉండగా, దాన్ని శైలజ ఒప్పుకోలేదు. దీంతో మనస్తాపం చెందిన శ్రీ చరణ్ ఈనెల 12న అనంతపురం సమీపంలోని ప్రసన్నాయపల్లి వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఈక్రమంలో శైలజ ఒప్పుకోకపోవడంతోనే కుమారుడు చనిపోయాడని బంధువులు సూటిపోటి మాటలు అన్నారు. దీంతో మనస్తాపం చెందిన శైలజ శనివారం పట్టణ సమీపంలోని పుట్లూరు రైల్వేగేటు వద్ద రైలుకిందపడి శైలజ ఆత్మహత్య చేసుకుందని పోలీసులు శనివారం తెలిపారు. కేసు నమోదు చేసినట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు.

జర్దోసి మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రూడ్‌సెట్‌లో జర్దోసి మగ్గం వర్క్‌పై 30రోజుల పాటు ఉచిత శిక్షణ ప్రారంభించను న్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి శనివారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 18-45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన మహిళలు అర్హులన్నారు. ఏప్రిల్ మూడో తేదీ నుంచి ప్రారంభించే ఉచిత శిక్షణకు సంబంధించి పేర్ల నమోదు, వివరాలకు సెల్ నంబరు 9492583484ను సంప్రదించాలని కోరారు.



స్టెప్నీ టైరుపై ప్రయాణించిన గుర్తుతెలియని వ్యక్తి

తాగి.. టైరుకింద ప్రయాణం..!

పీకలదాకా మద్యం సేవించిన ఓ వ్యక్తి ఆర్టీసీ బస్సు స్టెప్నీ టైరు కింద దాక్కున్నాడు. ఉన్నదంతా మందుకే ఖర్చు పెట్టాడో ఏమో.. బస్సులో ఎక్కకుండా కింద దూరాడు. అది తెలియక డ్రైవర్ బస్సుతో బయలుదేరాడు. మార్గ మధ్యంలో ద్విచక్ర వాహనదారులు గుర్తించి, బస్సును నిలిపేయడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. పుట్టపర్తి డిపో ఆర్టీసీ బస్సు కొత్తచెరువు మీదుగా హిందూపురం వెళుతుండగా, శనివారం ఈ సంఘటన చోటు చేసుకుంది. దాదాపు 15 కి.మీ. స్టెప్నీ టైరుకింద దాక్కుని ప్రయాణించాడు ఈ మద్యం వీరుడు. పెనుకొండ మండలం కొండంపల్లి సమీపంలో టైరుపై నుంచి కాలు వేలాడుతుండటాన్ని ద్విచక్ర వాహనదారులు గమనించారు. ముందుకు వెళ్లి డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. దీంతో డ్రైవర్ చిరంజీవిరెడ్డి కంగారుగా బస్సును పక్కన ఆపేశారు. కండక్టర్ విజయలక్ష్మి, డ్రైవర్ దిగివచ్చి ఆ వ్యక్తిని బయటకు రప్పించారు. పోలీసులకు సమాచారం అందించారు. పెనుకొండ పోలీసులు ఆ వ్యక్తిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. - ఆంధ్రజ్యోతి, కొత్తచెరువు, పెనుకొండ రూరల్

నేటి ప్రముఖులు

పోర్ట్రయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

పొట్టి శ్రీరాములు (జయంతి)



భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారకులు, ఆంధ్ర రాష్ట్ర సాధనకోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించి అమర జీవియైన పొట్టి శ్రీరాములు 1901 మార్చి 16న అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీ పరిధిలోని నెల్లూరు జిల్లా పడమటిపల్లిలో జన్మించారు. గాంధీజీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాలకోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు. 1952 డిసెంబరు 15న ఆశయసాధనలో ప్రాణాలర్పించి అమర జీవులయ్యారు. ఫలితంగా డిసెంబరు 19న ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేస్తూ అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ప్రకటించారు. 2000 మార్చి 16న ప్రత్యేక స్మారక పోస్టల్‌స్టాంపు విడుదల చేశారు.

ఆవుల సాంబశివరావు (జయంతి)



జస్టిస్ ఆవుల సాంబశివరావు 1917 మార్చి 16న గుంటూరు జిల్లా మూల్పూరు గ్రామంలో జన్మించారు. రాష్ట్ర మొట్టమొదటి లోకాయుక్తగా గుర్తింపు పొందారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగాను, ఆంధ్రా యూనివర్శిటీ వైస్ ఛాన్సెలర్‌గాను వ్యవహరించారు. 1966లో రెండో గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులయ్యె, 1967లో పర్మనెంట్ జడ్జిగా బాధ్యతలు చేపట్టిన ఘనత ఆయనది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు వెనుక ఆయన కృషి ఎంతో ఉంది. రాడికల్ హ్యూమనిస్ట్ భారత సంఘం అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఇండియన్ రేషనలిస్ట్ పత్రిక సంపాదకులు, తెలుగు విద్యార్థి పత్రికలో రెండు దశాబ్దాలకుపైగా శీర్షికను నిర్వహించారు. 2003 జూలై 27న కన్నుమూశారు.

మునిపల్లె రాజు (జయంతి)



మునిపల్లె రాజుగా పేరొందిన మునిపల్లె బక్కరాజు 1925 మార్చి 16న గుంటూరు జిల్లా కాకుమాను మండలం గరికపాడు గ్రామంలో జన్మించారు. తెలుగు కథను సుసంపన్నం చేసిన ప్రఖ్యాత కథకుడు, రచయిత. తెలుగులో మేజిక్ రియలిజంలో మొదటగా రాసిన రచయిత ఆయనే. తెలుగు పండితుడు జమ్మలమడక రామమూర్తి ప్రభావంతో సాహిత్యంలో ఆసక్తిని పెంపొందించు కున్నారు. 1943 నుంచి 83వరకు రక్షణశాఖలోని ఇంజనీరింగ్ సర్వీసులో సర్వేయర్‌గా పనిచేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, గోపీచంద్ పురస్కారం తదితర అవార్డులు పొందారు. 2018 ఫిబ్రవరి 24న మరణించారు.

ఉషశ్రీ (జయంతి)



ఉషశ్రీ 1928 మార్చి 16న పశ్చిమగోదావరి జిల్లాలో జన్మించారు. ఈయన అసలు పేరు పురాణపండ సూర్యప్రకాశ దీక్షితులు. ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో ఆయన చేపట్టిన 'ధర్మసందేహాలు' కార్యక్రమం ఎంతో పేరొందింది. తర్వాత వారంవారం రామాయణ, మహాభారతాలను ఆకాశవాణి నుంచి ప్రవచనం చేశారు. రేడియో వ్యాఖ్యాత, సాహితీ రచయితగా రాణించిన ఉషశ్రీచే టీటీడీ ఈఓగా పీవీఆర్‌కే ప్రసాద్ హయాంలో భాగవతం రాయించి పాతికవేల కాపీలు ముద్రించి తక్కువధరకే భక్తులకు అందించారు. 1990 సెప్టెంబరు 7న కన్నుమూశారు.

శ్రీరంగం గోపాలరత్నం (వర్ధంతి)



'పద్మశ్రీ' గ్రహీత శ్రీరంగం గోపాలరత్నం 1939 విజయనగరం జిల్లా పుష్పగిరిలో జన్మించారు. అద్భుతమైన గాత్రంతో 'మధుర గాయని' గా పేరొందారు. కూచిపూడి, యక్షగాన, జావాలి, ఎంకి పాటలు ఆలపించడంలో పేరొందారు. ఆలిండియా రేడియోలో 'భక్తి రంజని' కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. ఆర్టిస్ట్‌గా, హైదరాబాద్‌లోని గవర్నమెంట్ మ్యూజిక్ కాలేజ్ ప్రిన్సిపాల్, తెలుగు యూనివర్శిటీ ప్రొఫెసర్, డీన్‌గా వ్యవహరించారు. టీటీడీ ఆస్థాన విదూషిగా రాణించారు. 1993 మార్చి 16న కన్నుమూశారు.

రాగాల వెంకట రాహుల్ (పుట్టినరోజు)



రాగాల వెంకటరాహుల్ 1997 మార్చి 16న గుంటూరు జిల్లా స్టూవర్టుపురంలో జన్మించారు. సమ్మర్ యూత్ ఒలింపిక్స్‌లో అద్భుత ప్రతిభను కనబరిచారు. 2014 టోర్నీలో భారత్‌కు తొలి పతకాన్ని అందించారు. 2014లో చైనా దేశం నాన్‌జింగ్‌లో జరిగిన వెయిట్‌లిఫ్టింగ్ 77కిలోల విభాగంలో రజత పతకాన్ని సాధించారు. ఆస్ట్రేలియా దేశం గోల్డ్‌కోస్ట్‌లో 2018 కామన్వెల్త్ పోటీలలో 85కిలోల విభాగంలో బంగారుపతకం సాధించారు. 2022 ఫిబ్రవరిలో సింగపూర్‌లో జరిగిన ఇంటర్నేషనల్ పోటీల్లో 96 కిలోల విభాగంలో కాంస్యపతకం సాధించారు.

రేపటి నుంచి ఉచిత కిడ్నీ పరీక్షా శిబిరం

బెంగళూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో కిడ్నీ జబ్బులపై అవగాహన కల్పించడంతోపాటు 10వేలమందికి ఉచితంగా పరీక్షలు జరపదలిచినట్టు కావేరి ఆసుపత్రుల డైరెక్టర్ రామ మోహన్ ప్రకటించారు. రామకృష్ణ చారిటబుల్ ట్రస్టు సహకారంతో ఉచిత పరీక్షా శిబిరం జరుపుతామ న్నారు. ఈనెల 17 నుంచి 25వరకు 9 గ్రామాల పరిధి లో శిబిరాలు కొనసాగించ దలిచామ న్నారు. కిడ్నీ జబ్బుల తోపాటు బీపీ, షుగర్ పరీక్షలు చేస్తామని తెలిపారు.

కేబుల్ వైరు చోరీ

చిలమత్తూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మోటార్లుకు ఏర్పాటుచేసుకున్న కేబుల్ వైర్‌ను గుర్తుతెలియని వ్యక్తు లు శుక్రవారం చోరీ చేశారు. 30 మీటర్ల కేబుల్ వైర్‌ను చోరీ చేసినట్లు కోడూరు రైతులు బాబు రెడ్డి, ఈశ్వర‌రెడ్డి, రాజేంద్రరెడ్డి తెలిపారు. ఇలాంటి ఘటనలు తరుచూ జరుగుతున్నాయని, పోలీసులు స్పందించి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

కాడుగూడిలో కోదండరామస్వామి బ్రహ్మరథోత్సవం



పురవీధులలో రథోత్సవం



● చిక్కదాసనహళ్లిలో ఘనంగా బ్యాట రాయస్వామి ఉత్సవాలు

చిక్కదాసరహళ్లి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మహదేవపుర, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కాడుగూడి బ్రహ్మరథోత్సవం వైభవంగా జరిగింది. తొలుత ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగించారు. కాడుగూడి, చన్నసంద్ర, బెళత్తూరు, శిగేహళ్ళి, వైట్‌ఫీల్డ్, హగదూరు, నల్లూరహళ్ళి చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. పల్లకీని మాజీ మంత్రి అరవింద లింబావళి స్వయంగా మోసి రథోత్సవానికి శ్రీకారం చుట్టారు. ఉత్సవంలో వీరగాసె, డొళ్ళుకుణిత, తమటె, పూజాకుణిత, నాదస్వర, మైసూరు నగారి, నందిధ్వజ కుణిత, కీలు గుర్రాలు, గారడీ బొమ్మలు తదితర కళాకారుల బృందాలు సందడి చేశాయి. ఉత్సవంలో నియోజకవర్గ గ్రామీణ బీజేపీ అధ్యక్షుడు కబడ్డీ పిళ్ళప్ప, ప్రముఖులు కేఎన్ అశ్వత్థనారాయణరెడ్డి, లక్ష్మినారాయణ, శ్రీనివాస్, అరవింద్, ప్రదీప్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్యాటరాయస్వామి రథోత్సవం

శిడ్లఘట్ట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని చిక్కదాసర హళ్ళిలో కొండపై నెలవైన శ్రీదేవి భూదేవి సమేత బ్యాటరాయస్వామి బ్రహ్మ రథోత్సవం వైభవంగా జరిగింది. పురాతనమైన 4వేల సంవత్సరాల చరిత్ర ఆలయానికి ఉంది. ఉత్సవమూర్తులకు విశేష పూజల అనంతరం రథోత్సవం నిర్వహించారు. మహా మంగళారతి అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. రథంపై దవనం, అరటిపండు వేసి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో సందడి నెలకొంది. ఉత్సవంలో ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్, ఆలయ సమితి అధ్యక్షుడు బ్యాటరాయశెట్టి, కాంగ్రెస్ నాయకుడు రాజీవ్‌గౌడ, సహన రాజీవ్, పుట్టు ఆంజినప్ప, బంకు మునియప్ప, తాదూరు రఘు తదితరులు పాల్గొన్నారు.



పల్లకీ మోస్తున్న మాజీ మంత్రి అరవింద లింబావళి

మహిళా దినోత్సవం ఒక్కరోజుకే పరిమితం కారాదు : నటి సోనల్

బెంగళూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం కేవలం ఒకరోజుకే పరిమితం కారాదని నటి సోనల్ మాంటిరో అభిప్రాయపడ్డారు. మహిళ ప్రతిక్షణం నిర్భయంగా జీవించాలని ప్రతి మనిషిలో ఆలోచనలో మార్పు ద్వారా మహిళలకు సమాజంలో సముచిత స్థానం సాధ్యమన్నారు. నగరంలోని రాజరాజేశ్వరి మెడికల్ కళాశాలలో శనివారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మూగాంబిగై చారిటబుల్ ట్రస్టు లలితా లక్ష్మి అధ్యక్షత వహించారు. రాజరాజేశ్వరి గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు ఏసీ షణ్ముగంతోపాటు పలువురు పాల్గొన్నారు. నటి సోనల్ మాంటిరో మాట్లాడుతూ మహిళా సాధికారత అంటే కళలు కనడం కాదని వారికి సంపూర్ణ స్వాతంత్ర్యం కల్పించడం, సమగ్ర అవకాశాలను ఇవ్వడం ద్వారానే సాధ్యమన్నారు. ఉత్తమ విద్యతోనే మహిళల్లో మార్పు రానుందని అభిప్రాయపడ్డారు. లలితా లక్ష్మి మాట్లాడుతూ ప్రతి సంస్థలోనూ 33శాతం మహిళలకు రిజర్వేషన్ ఉండాలనే నిబంధన ఉందని, మా సంస్థలో 50శాతం బాలికలే చదువుతున్నారన్నారు. మహిళల అభివృద్ధికి సహకరించే పురుషులను గౌరవించాలన్నారు. ఏసీ షణ్ముగం మాట్లాడుతూ రాజరాజేశ్వరి సంస్థలు అభివృద్ధికి మహిళలు కీలకమన్నారు. సెయింట్ బెనెడిక్ట్ అకాడమీ డైరెక్టర్ రెవరెండ్ జెరోమ్ ఓఎస్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు.

కైవార తాతయ్య భావాలు స్ఫూర్తిదాయకం

శిడ్లఘట్ట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కైవార యోగినారేయణ తాతయ్య ఆధ్యాత్మిక భావాలు, ఆలోచనలు, కీర్తనలు నేటికీ స్ఫూర్తిదాయకమని తహశీల్దార్ బీఎస్ స్వామి అభిప్రాయపడ్డారు. జాతీయ పండుగల ఆచరణ సమితి ఆధ్వర్యంలో తాలూకా కార్యాలయం సభాంగణంలో రెండురోజుల యోగి నారేయణ యతీంద్రుల జయంతిలో పాల్గొని మాట్లాడారు. కోలారు, చిక్కబళ్ళాపుర, బెంగళూరు గ్రామీణ ప్రాంతాలలో కైవార నారేయణ తాతయ్య ఆధ్యాత్మికత ప్రభావం అధికమన్నారు. ఆయన కీర్తనలు జనజీవనానికి దగ్గరగా ఉంటాయని, అందరికీ సులభంగా అర్థం కాగలవన్నారు. సామాన్య వ్యక్తి అయినప్పటికీ సమాజంకోసం జీవితాన్ని త్యాగం చేసి చరిత్రలో తనదైన ఘనతతో అజరామరంగా నిలిచారన్నారు. తొలుత తాతయ్య భావచిత్రానికి పుష్పాంజలి ఘటించారు. ఇదే సందర్భంగా సముదాయానికి చెందిన ఎస్ఎస్ఎల్‌సీ, ద్వితీయ పీయూసీ ప్రతిభావంత విద్యార్థులను సత్కరించారు. అనంతరం చింతామణి రోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయం నుంచి యోగి నారేయణ చిత్రాన్ని పల్లకీలో పురవీధులలో ఊరేగించారు. పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్, మాజీ మంత్రి వీ మునియప్ప, బీజేపీ నాయ కుడు సీకల్ రామచంద్రగౌడ, కాంగ్రెస్ నాయకుడు రాజీవ్‌గౌడ, పుట్టు ఆంజ నప్ప, మాజీ ఎమ్మెల్యే ఎం రాజణ్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధికారితో సఫాయి కర్మచారి సభ్యుల భేటీ



జిల్లా అధికారి బసవరాజును ఆత్మీయ స్వాగతిస్తున్న ఆర్‌వీ మను

దొడ్డబళ్ళాపుర, మార్చి 15(ఆంధ్రజ్యోతి): బెంగళూరు గ్రామీణ జిల్లా నూతనంగా నియమితులైన జిల్లా అధికారి ఏబీ బసవరాజును జిల్లా సఫాయికర్మచారి పునరావాస సమితి సభ్యుడు ఆర్‌వీ మను మర్యాదపూర్వకంగా భేటీ అయి మొక్కను అందచేసి స్వాగతించారు. అనంతరం జిల్లా అధికారి అధ్యక్షతన జరిగిన జిల్లా సఫాయి కర్మచారి పునర్వసతి సమితి సభలో పాల్గొన్నారు. విధి నిర్వహణలో ఉండే సఫాయికర్మచారిల ఆరోగ్యదృష్ట్యా మాస్క్ ధరించడం, కాళ్ల చేతులకు గ్లవ్స్, రక్షణాత్మక యూనిఫాం ధరించే అంశంపై అవగాహన కల్పించాలని సూచించారు. నెలకోసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకునేలా జాగృతి కల్పించాలన్నారు. సఫాయి కర్మచారిలకు నిర్ణీత సమయానికి వేతనాలు చెల్లించాలని, అత్యవసర వేళల్లో సెలవు ఇవ్వాలని, ఇంటి స్థలం లేదా ఇల్లు కల్పించాలని జిల్లా అధికారిని కోరారు. ఈ సందర్భంగా మ్యాథ్యూ మునియప్ప, రవికళ, తాలూకాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై రైతుల నిరసన

బంగారపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బంగారపేట తాలూకా కార్యాలయంలో అవినీతి తారస్థాయికి చేరిందని ప్రతి టేబుల్‌కు లంచం ఇస్తేనే ఫైళ్లు కదలడం లేదని రైతుసంఘం (పుట్టణ్ణయ్య శెట్టి) ఆరోపించింది. తాలూకా కార్యాలయం రైతుసంఘం ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపింది. భూ మాఫియా, దళారుల చేతుల్లో అధికారులు కీలుబొమ్మగా మారారని ఆరోపించారు. గ్రేడ్ 2 తహసీల్దార్ గాయత్రికి వినతిపత్రం అందచేశారు. ఒక రికార్డు కోసం నెలలతరబడి వేచి ఉండాల్సి వస్తోందన్నారు. నిర సనలో రైతుసంఘం సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రైతు సంఘం అధ్యక్షుడు నితిన్, ప్రముఖులు కృష్ణప్ప, కేఎస్ రవి, రమేశ్, సిద్ధప్ప, శంకర్, మహిళా ప్రముఖులు దేవి శంకర్, నాగ వేణి, ఆనంద్, కోలారు అధ్యక్షురాలు సుజాత తదితరులు పాల్గొన్నారు.



గ్రేడ్-2 తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

చేనేత వస్త్రాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

బెంగళూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): చేనేత వస్త్రాలకు ప్రాధాన్యత ఇవ్వాలని నేత కార్మికుల అభివృద్ధికి అన్ని వర్గాలు పాటుపడాలని రాష్ట్ర చేనేత సహకార, కార్మిక సమాఖ్య అధ్యక్షులు బీజే గణేశ్ అభిప్రాయపడ్డారు. జాతీయ విన్యాసకేంద్రం, కేంద్రప్రభుత్వ డెవలప్‌మెంట్ కమిషన్, చేనేత మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన శారీ ఉత్సవ్‌ను శుక్రవారం లాంఛ నంగా ప్రారంభించారు. ఉగాది పండుగను పురస్కరించుకుని ఉత్సవ్‌ను ఏర్పాటు చేసినట్టు అధ్యక్షులు గణేశ్ తెలిపారు. దేశీయ చేనేత పరంపరను సంరక్షణతోపాటు ప్రోత్సహించేదిశగా ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు. కేవలం చేనేత వస్త్రాలను మాత్రమే ప్రదర్శనలు ఉన్నాయన్నారు. భవిష్యత్తు తరాలలోనూ చేనేతలు మనుగడ సాధించాలంటే ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, మార్చి15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 3 వార్డులో నివాసముంటున్న వివాహిత స్వప్న విషద్రావకం తాగి శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ తగాదాల నేపథ్యంలో మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి డాక్టర్ ఉషా చికిత్స అందజేసి మెరుగైన వైద్యం కోసం హిందూపురం వెళ్లాలని సూచించారు.

'వీధి దీపాలను ఏర్పాటుచేయండి'

చిలమత్తూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): గ్రామంలో నాలుగు నెలలుగా వీధి దీపాలు లేక చీకటిలో మగ్గుతున్నామని, వెంటనే ఏర్పాటుచేయాలని తుమ్మల కుంట గ్రామస్థులు శనివారం చిలమత్తూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి సావిత్రికి వినతిపత్రం అందించారు. ఇటీవల దొంగతనాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకొని వీధి దీపాలు ఏర్పాటుచేయాలని కోరారు. వెంటనే ఏర్పాటుచేస్తామని పంచాయతీ కార్యదర్శి గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

రౌడీషీటర్ దారుణహత్య

ప్యారీస్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం ప్యారీస్ పట్టణం తేనాంపేటలో పాతకక్షల నేపథ్యంలో శుక్రవారం రాత్రి పేరుమోసిన రౌడీషీటర్‌ను దారుణంగా హతమార్చారు. పట్టుకునేందుకు యత్నించిన ఎస్‌ఐను కత్తిచూపి బెదిరించి పరారైన హంతకుల ముఠా కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. తేనాంపేటకు చెందిన రాజా(40) రౌడీషీటర్. అతనిపై నగరంలోని పలు పోలీస్‌స్టేషన్లలో 20కిపైగా క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి తేనాంపేట భారతీయార్ రోడ్డులో నడిచివెళ్తున్న రాజాను ద్విచక్రవాహనంపై వెళ్లిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు మారణాయుధాలతో దాడి చేశారు. తలకు తీవ్రగాయాలవడంతో రాజా ఆ ముఠా నుంచి తప్పించుకునేందుకు యత్నించడం ఆ ప్రాంతంలో భద్రతా విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ హంతకుల ముఠాను పట్టుకునేందుకు యత్నించారు. కత్తితో బెదిరించి వారు పారిపోయారు. ఈ నేపథ్యంలో రాజా రక్తపుమడుగులో అక్కడిక్కడే మృతిచెందాడు. సమాచారమందుకుని సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని అంబులెన్సులో రాయపేటలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం హత్య జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరా పుటేజీని పోలీసులు పరిశీలించారు. దీని ఆధారంగా పరారైన నిందితులు తేనాంపేటకు చెందిన రౌడీలు మాండుమణి, రాజేంద్రన్, విఘ్నేష్‌గా అనుమానిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అధికార డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయం సమీపంలో జన సంచారం అధికంగా ఉండే తేనాంపేటలో రౌడీని హతమార్చిన సంఘటన స్థానికులను భయాందోళనలకు గురి చేసింది.

అక్రమంగా పిస్టల్ విక్రయాలు

▸▸ ఐదుగురు పేరుమోసిన నేరగాళ్ల అరెస్టు



అరెస్టు అయిన ఐదుగురు నిందితులు

బెంగళూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అక్రమంగా పిస్టళ్లు, గంజాయి విక్రయిస్తున్న ముఠాను మంగళూరు సీసీబీ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారినుంచి మూడు పిస్టళ్లతోపాటు ఆరు బుల్లెట్‌లు, 12 కేజీల గంజాయిని, 3 కార్లను స్వాధీనం చేసుకున్నారు. కేరళ రాష్ట్రం కాసరగూడు జిల్లా బీమనది గ్రామానికి చెందిన నౌఫల్ (38), బెంగళూరు సుంకదకట్టె నివాసి మన్సూర్ (36), అబ్దుల్ లతీఫ్ (29), మహ్మద్ అస్కర్ (27), మహ్మద్ సాలి (31)లను అరెస్టు చేసినట్టు మంగళూరు సీసీబీ పోలీసులు ప్రకటించారు. ఈనెల 12న నాటికల్‌లో స్కార్పియో కారులో అనుమానాస్పదంగా తిరుగుతున్న కేరళ రాష్ట్రానికి చెందిన నౌఫల్, మన్సూర్‌లను అదుపులోకి తీసుకోగా వారినుంచి రెండు పిస్టళ్లు లభించాయన్నారు. సమగ్ర విచారణ జరపడంతో మరో ముగ్గురు పట్టుబడ్డారన్నారు. వీరు తుపాకులను విక్రయిస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. 15.70 లక్షల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నామన్నారు. మంగళూరు గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. నిందితులకు అబ్దుల్ లతీఫ్ తుపాకీ విక్రయించినట్టు గుర్తించామన్నారు. వీరంతా ముఠాగా అవసరమైనవారికి తుపాకీలు, గంజాయి సమకూర్చేవారన్నారు. 2024లో ఓ నిందితుడు అస్లర్‌కు ఇతడే తుపాకీ విక్రయించారన్నారు.

జట్టును గెలిపించిన యువకుడి అనుమానాస్పద మృతి

▸▸ 4 బంతుల్లో 20 పరుగులు



దివ్యకుమార్ (ఫైల్)

బెంగళూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మైసూరు జిల్లా హెచ్‌డీ కోటె తాలూకాలో టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో 4 బంతులలో 20 పరుగులు చేయాల్సిన ఆఖరు క్షణంలో రంగంలోకి దిగిన దివ్యకుమార్ వరుస సిక్సర్‌లతో గెలిపించారు. ఇదే అతడి మృతికి కారణమని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెచ్‌డి కోటె తాలూకాలో టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌కు ప్రాధాన్యత ఎక్కువ. ప్రీమియర్ లీగ్ పేరిట జేపీ వారియర్స్, డెవిల్ సూపర్‌కింగ్స్ జట్ల మధ్య ఫైనల్‌మ్యాచ్ జరిగింది. జేపీ వారియర్స్ జట్టు చివరి నాలుగు బాల్స్‌కు 20 పరుగులు చేయాల్సి ఉండేది. దివ్యకుమార్ (25) చివరగా బ్యాటింగ్‌కు దిగి నాలుగు సిక్స్‌లు సాధించాడు. దీంతో జట్టు విజయం సాధించింది. గెలిచిన ఉత్సాహంలో పార్టీ చేసుకుని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ఓ పొదలో దివ్యకుమార్ పడి పోయాడు. అప్పటికే అతను స్పృహలో లేడు. స్థానికులు గుర్తించి ఆసు పత్రిలో చేర్పించారు. 20రోజులపాటు చికిత్సలు పొందిన దివ్యకుమార్ శనివారం మృతి చెందాడు. సంఘటన రోజున ప్రమాదంగా భావించారు. కానీ ప్రమాదస్థలం వద్ద ఎటువంటి అనుమానం వచ్చేలాంటి రాళ్లుగానీ గుంతలుగానీ లేవు. పైగా రోడ్డు సమాంతరంగా ఉంది. పార్టీలో గొడవ జరిగిందా... లేదా ఓడిన టీమ్ దాడి చేసిందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసుల దర్యాప్తులో వాస్తవాలు వెలుగు చూస్తాయని ప్రజలు భావిస్తున్నారు.

సైబర్ సురక్షణలో నైపుణ్యత, ఉద్యోగాలకు ఒప్పందం


బెంగళూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సైబర్ సురక్షణలో నైపుణ్యత, ఉద్యోగ అవకాశాలకై జేఎన్‌టీయూ, జేవీ యూనివర్సిటీలు కీలక ఒప్పందం చేసుకున్నాయి. ఇన్ఫర్మేషన్ షేరింగ్ అండ్ అనాలసిస్ సెంటర్ (ఐఎస్ఏసీ)తో భాగస్వామ్యం కాదలిచాయి. ఒప్పందం ప్రకారం సైబర్ సురక్షణా రంగంలో విద్యార్థులకు అవకాశం కల్పించదలిచినట్టు ఐఎస్ఏసీ కులపతి రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, ఈడీ కేప్టెన్ ఆనందనాయుడు, ప్రొఫెసర్ జయసుమ, డైరెక్టర్ నాగరాజ్‌లు పాల్గొన్నారు. యూనివర్సిటీలో సైబర్ సురక్షతా కేంద్రాలు ఏర్పాటు ఏసి పరిశోధనలు, ఆవిష్కరణల విభాగంలో విద్యార్థులకు చైతన్యం కలిగించదలిచామని ప్రకటించారు. దేశంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్న తరుణంలో యువ విద్యార్థులలో సమగ్ర అవగాహన అవసరమన్నారు. ఈ మేరకు బెంగళూరులో జేవీ యూనివర్సిటీ ప్రతినిధులు ఒక ప్రకటన విడుదల చేశారు.

మహిళా నాయకత్వంపై చర్చాగోష్టి



చర్చాగోష్టిలో పాల్గొన్న ప్రముఖులు

బెంగళూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని సౌందర్య మేనేజిమెంట్ అండ్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్‌లో మహిళా నాయకత్వంపై చర్చాగోష్టి జరిగింది. వివిధ రంగాల సాధకులను సత్కరించారు. ప్రస్తుత అంశాలపై అప్‌డేట్ కావడం, వ్యవహారం, తంత్రజ్ఞానం, సమాజంలో మహిళా స్వావలంబన అంశాలపై చర్చించారు. డాక్టర్ ఆభా భర్తియా మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. శ్రేయాకృష్ణన్ మాట్లాడుతూ సంబంధిత అంశంపై జ్ఞానాన్ని పెంచుకుని ముందుకు సాగాలని, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలన్నారు. సోహిని ముఖర్జీ, అసితా దేవాంగి, స్మితారాణి తదితరులు ప్రసంగించారు. ఇన్‌స్టిట్యూట్ ట్రస్టీ ప్రతీక్షా, కీర్తన్ తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1599.98	1,583.32
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	7,072	2.199
నీటి నిల్వ (టీఎంసీలు)	21.49	6.28

అలరించిన నాటక ప్రదర్శన



నాటక ప్రదర్శనలో కళాకారులు

కంప్లి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సిద్దేశ్వర రంగ సంస్థ కల్చరల్ ట్రస్టు మావినహళ్లి, కన్నడ, సాంస్కృతిక శాఖ సహకారంతో చిక్కజాగనూరు గ్రామంలోని మల్లికార్జున దేవాలయ ఆవరణలో శుక్రవారం రాత్రి నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వారు కళాకారులు మాట్లాడుతూ నేటి పిల్లలు కళలు, సాహిత్యం, నాటకం, సంగీతం, బృంద నాట్యం వంటి వాటిని మరచిపోయారని, యువ తరానికి జానపద కళలపై అవగాహన కల్పించడమే తమ లక్ష్యమన్నారు. మావినహళ్లి కృషి చేస్తోందని, జ్యోతి ప్రజ్వన చేసి ప్రారంభోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించిన వికాస్ అకాడమీ కలబురిగి కన్వీనర్ అమరగౌడ ప్రారంభోపన్యాసంలో ప్రతిపాదించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గ్రామ పంచాయతీ ఛైర్ పర్సన్ కవితాపంపనగౌడ్ మాట్లాడుతూ సిద్దేశ్వర రంగసంస్థ కల్చరల్ ట్రస్టు అధ్యక్షుడు గురు మహంతేష్, కురుబర మహేశ్వర గ్రామీణ ప్రాంత ప్రజలను కళా సాహిత్యాల ద్వారా నిరంతరం అలరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర బసాపుర అండ్ టీమ్, సుగమ సంగీత కార్యక్రమం, శ్రీకుమారి సంగీత్, కారులను సనాపూర్ కంప్లి తాలుకా, బృందంచే షూమ్ నృత్య, అశ్విని డ్యాన్స్ అకాడమీ విద్యార్థుల చారిత్రక నాటకం, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. పక్కీరప్ప, హనుమయ్య, విరుపాక్షప్ప, ముదియప్ప, సిద్దప్ప, ధర్మప్ప, సిద్దకుమార్, గురు మహంతేష్, హేమేశ్వర, హేమంతరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇకపై పది కిలోల బియ్యం..

సిరుగుప్ప, మార్చి 15(ఆంధ్రజ్యోతి) : ఈ నెల రేషన్ లబ్దిదారులకు ఒక్కొక్కరికి పది కిలోల బియ్యం పంపిణీ చేస్తామని 4వ వార్డు రేషన్ డీలర్ ఫజల్ అహ్మద్ శనివారం తెలిపారు. ఇదివరకు ప్రభుత్వం రెండేళ్లు ఐదు కిలోల బియ్యం, మిగిలిన ఐదు కిలోలకు బ్యాంకు ఖాతాలో నగదు జమ చేసేవారు. అలా కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలపి ఒక్కొక్కరికి పదికిలోల బియ్యం పంపిణీ చేసేలా ఆదేశాలు జారీ చేశారన్నారు. నిరుపేద లబ్దిదారులకు 35 కిలోలు అదనంగా ఐదు కిలోలు ఇస్తామని తెలిపారు. ఫిబ్రవరిలో ఐదు కిలోలు బ్యాలెన్స్ ఉన్నప్పటికీ ఈ నెల రెండు కలసి 15 కిలోలు పంపిణీ చేస్తామని తెలిపారు. లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆరోగ్య వ్యవస్థను మెరుగుపరచడంలో చేతులు కలపాలి

మీడియా ప్రతినిధులతో డీహెచ్ఓ డాక్టర్ రమేష్ బాబు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీహెచ్ఓ డాక్టర్ రమేష్ బాబు

బళ్లారి సిటీ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య వ్యవస్థను మరింత మెరుగుపరచడానికి మీడియా ప్రతినిధులు చేతులు కలపాలని జిల్లాఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డా. రమేష్ బాబు అన్నారు. జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ , జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ , సమాచార విద్య కమ్యూనికేషన్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ ఆరోగ్య అభియాన్ కింద నగరంలోని జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ హాల్లో శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీహెచ్ఓ మాట్లాడుతూ జిల్లాలో ఆరోగ్య శాఖ అమలు చేస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలన్నింటినీ దిన పత్రికల్లో ప్రచురించడం హర్షణీయమన్నారు. గత నవంబర్‌లో జరిగిన బాలింతల మృతి సంఘటన బాధాకరమని, దీనివల్ల జిల్లా ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చేవారి సంఖ్య తగ్గిందన్నారు. అయితే మీడియా వారికి అవగాహన కల్పిస్తోందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. మీడియా ప్రతినిధుల ఆరోగ్యం ముఖ్యం వారి భద్రత కోసం కనీసం సంవత్సరానికి ఒకసారి వారికి సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించడానికి ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు.

జిల్లా ఆసుపత్రి బాగా పనిచేస్తోందని జిల్లా సర్జన్ డాక్టర్ బసారెడ్డి అన్నారు. అత్యాధునిక సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో మాతాశిశు మరణాలను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆస్పత్రుల్లో అసౌకర్యాలను తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. జిల్లా ఆర్‌సీహెచ్ అధికారి డాక్టర్ హనుమంతప్ప మాట్లాడుతూ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలు, సౌకర్యాలు , ఆరోగ్య అవగాహన సందేశాలను ప్రజలకు తెలియజేయడంలో మీడియా పాత్ర కీలకమైన దన్నారు. ప్రముఖుల నుండి ఆరోగ్య శాఖ నుండి జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సంక్షిప్త సమాచారంతో కూడిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా జిల్లాసర్వేయర్ డాక్టర్ మరియంబి, జిల్లా కుటుంబ సంక్షేమ కార్యక్రమ అమలు అధికారి డాక్టర్ పూర్ణిమా కత్తిమణి, జిల్లా కుష్టువ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ వీరేంద్రకుమార్, జిల్లా మలేరియా నియంత్రణ అధికారి డాక్టర్ అబ్దుల్లా, మానసిక వైద్యుడు డాక్టర్ రోహన్ వానగుండి, జిల్లాఆరోగ్య విద్య అధికారి ఈశ్వర్ దాసనప్పనవర్, తాలూకా ఆరోగ్య విద్య అధికారి శాంతమ్మ,మీడియా ప్రతినిధులు ,వైద్యులు, జిల్లాఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పత్రికలు చదవడం అలవరచుకోవాలి

● విద్యార్థులకు ప్రొఫెసర్ తిప్పేరుద్ర సూచన



మాట్లాడుతున్న ప్రొఫెసర్ తిప్పేరుద్ర

బళ్లారి సిటీ,మార్చి 15(ఆంధ్రజ్యోతి): నిత్యం వార్తాపత్రికలు చదవడం అలవాటుగా మార్చుకోవాలని, పోటీ పరీక్షల్లో విజయానికి దీటుగా నిలుస్తాయని ప్రొఫెసర్ తిప్పేరుద్ర విద్యార్థులకు సూచించారు. శనివారం ప్రభుత్వ ప్రథమశ్రేణి కళాశాల ఆడిటోరియంలో ప్రేరణకోశ, ఉపాధి హామీసెల్, ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్తాపత్రికలు, వర్తమాన రాజకీయాలపై ఉద్యోగార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ ప్రహ్లాద్ చౌదరి మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విద్యార్థులు కృషి చేస్తే సాధించలేదని ఏమీ లేదన్నారు. ఈసందర్భంలో దస్తగిరిసాబ్, ప్రొఫెసర్ డా.పల్లవి పాల్గొన్నారు.

వైభవంగా సుదీంద్ర తీర్థ పూర్వారాధన

కంప్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : హంపి ఆనెగొంది సమీపంలోని నవ బృందావన్ ప్రాంతంలో శనివారం రాఘవేంద్ర స్వామి వారి గురువైన సుదీంద్ర తీర్థులి పూర్వారాధన వైభవంగా జరుపుకున్నారు. ఆరాధన నాయకుడు సుదీంద్ర తీర్థ సోసలే దర్శనం పొంది మహామంగళహారతి నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు, శిష్యులకు అన్నదానం చేశారు. గజేంద్రగడ భజన మండలి సభ్యులు భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనేగొంది బ్రాంచ్ మఠం మేనేజర్ సుమంత కులకర్ణి, గంగావతి మఠాల సుశాలేంద్ర ఆచారి, హోస్పేట మఠం పవనాచార్య, అర్చకులు విజేంద్ర ఆచార, నరసింహాచారి, శ్రీనివాసాచారి, తదితరులు పాల్గొన్నారు.



అలంకరణలో నవబృందావనం

మట్టి అక్రమ తవ్వకాలపై ఉప లోకాయుక్త ఆగ్రహం

విజయనగరం (హోస్పేట), మార్చి 15(ఆంధ్ర జ్యోతి) : వ్యవసాయ భూమిలో అక్రమ మట్టి తవ్వకాలు జరపడంతపై ఉప లోకాయుక్త వీరప్ప అధికారులపై మండిపడ్డారు. శనివారం ఆయన సంక్లాపూర్ సమీపంలోని మున్సిపల్ ఘన వ్యర్థాల తొలగింపు విభాగాన్ని సందర్శించారు. అనంతరం కల్లహళ్లిలోని రాజాపూర్‌లోని పట్టా ల్యాండ్ సర్వే నెంబర్ 144లోని వాలి నాయక్‌కు చెందిసన 4.81 సెంట్ల భూమిలో పది అడుగులకు పైగా లోతుకు మట్టిని తవ్వి తరలించారని, దీని వల్ల భవిష్యత్తులో సాగు చేయడం అసాధ్యంగా మారిందని గమనించారు. అక్రమమంగా మట్టిని తొలగిస్తున్నారని తెలుసుకున్న తరువాత ఆ స్థలంలో ఉన్న గనులు, భూగర్భశాస్త్ర శాఖ డిప్యూటీ డైరెక్టర్ కీర్తికుమార్, భూ విజ్ఞాన శాస్త్రవేత్త కిరణ్ రెండు రోజులుగా ఆస్థలంలో ఉన్న జేసీబీతో సహా ఎటువంటి చట్టపరమైన చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఆరు నెలలుగా మట్టి తవ్వకం గురించి రెవెన్యూ ఇన్స్‌పెక్టర్, తహసీల్దార్‌కు నివేదించామని గ్రామ నిర్వాహకుడు ప్రతాప్ సమాధానమివ్వగా ఆ స్థలంలో వున్న తహసీల్దార్‌కు ఈ విషయం తెలియకపోవడం పట్ల ఉపలోకాయుక్త ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తారా అని గద్దించారు.



మట్టిని తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న లోకాయుక్త అధికారులు



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్నడిప్యూటీ డైరెక్టర్ విజయ్‌కుమార్

బాలికల విద్యపై వివక్ష చూపరాదు

● స్త్రీ,శిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయ్‌కుమార్

బళ్లారి సిటీ,మార్చి 15(ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళల పాత్ర చాలా ముఖ్యమైనదని, బాలికల విద్యపై వివక్ష చూపరాదని స్త్రీ,శిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ కే.హెచ్.విజయ్‌కుమార్ అన్నారు. బేటీ బచావ్, బేటీ పడావ్ పథకం 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో అంతర్జాతీయ శనివారం వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా మహిళలు, పిల్లల భద్రత, సాధికారతపై అవగాహన కల్పించడానికి జిల్లా యంత్రాంగం, జిల్లాపంచాయతీ, జిల్లాన్యాయ సేవల అథారిటీ, మహిళా శిశు అభివృద్ధి శాఖ సంయుక్తంగా కొత్త జిల్లా పరిపాలన భవనం ప్రాంగణంలో శనివారం నిర్వహించిన బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రధానమంత్రి ప్రతిష్ఠాత్మకమైన బేటీ బచావ్..బేటీ పడావ్ పథకం 10సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఆడపిల్లలపై వివక్షను తొలగిస్తుంది దానిపట్ల ప్రజల ప్రతికూల దృక్పథాలను మార్చడం బాల్య వివాహాలను అరికట్టడం, బాలికలను రక్షించడం ఈ ప్రాజెక్టు లక్ష్యమని అన్నారు. భ్రూణ హత్య చట్టరీత్యా నేరం, స్త్రీ సమాజానికి కళ్ళు బాలికల విద్యను ప్రోత్సహించడానికి అనేక పథకాలు అమలు చేస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమాజంలో ఎలాంటి వివక్షత లేకుండా జీవించే ,విద్యను పొందే హక్కు బాలికలకరు ఉంది. ప్రతి ఆడపిల్ల చదువు మానేయకుండా విద్యను పొందాలి. తగ్గుతున్న స్త్రీ లింగ నిష్పత్తిని మెరుగుపరచడానికి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈసందర్భంగా జిల్లా మహిళా శిశు అభివృద్ధి శాఖ అధికారి జలాలప్ప ,మహిళా శిశు అభివృద్ధి శాఖ జిల్లాప్రాతినిధ్య అధికారి రామకృష్ణనాయక్, జిల్లాబాలల రక్షణ అధికారి నాగప్ప, సిడీపీఓ అధికారులు , అంగన్‌వాడీ కేంద్రాల కార్మికులు, తదితరులు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాదయాత్ర



కార్యకర్తలతో కలిసి పాదయాత్రగా వెళ్తున్న ఎమ్మెల్యే జేఎన్ గణేష్

కంప్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ఎమ్మెల్యే జేఎన్ గణేష్ కురుగోడుకు కురుగోడు దొడ్డ బసవేశ్వర రథోత్సవం పురస్కరించుకుని పాదయాత్రగా వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి పట్టణంలో, గ్రామంలో అందరూ సంతోషంగా వుండాలనే ఈ పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. పలు గ్రామాల్లో ఆయనకు ప్రజలు ఘనస్వాగతం పలికారు ఈ పాదయాత్రలో కంప్లి, కురుగోడు పట్టణాలతో పాటు గ్రామాల కార్యకర్తలు, నాయకులు, పురసభ అధ్యక్షులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంపై తహసీల్దార్ ఆగ్రహం



నగరసభ అధికారులపై మండిపడుతున్న తహసీల్దార్

సిరుగుప్ప, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఈ- ఖాతా పంపిణీలో నగరసభ అధికారుల నిర్లక్ష్యంపై తహసీల్దార్ విశ్వనాథ్ మండిపడ్డారు. శనివారం ఆయన కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్రప్రభుత్వం ఆర్ఎస్ఎస్ ల్యాండ్‌కు సంబంధించి ఈ ఖాతా చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ నెల దగ్గరపడుతున్నా ఇంతవరకు కేవలం 111 మాత్రం రిజిస్టర్ కావడం సిగ్గేచేటని అధికారులపై మండిపడ్డారు. నగరసభ కమిషనర్ గురుప్రసాద్, రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై ప్రజలకు పనులు చేస్తున్నారా ప్రజలను మభ్యపెడుతున్నారా అంటూ ధ్వజమెత్తారు. జిల్లా అధికారులు సిరుగుప్ప నగరసభపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లో సందర్శిస్తారని సమాధానాలు చెప్పేందుకు సిద్దంగా వుండాలన్నారు. ఇక నుంచి పనులు వేగవంతం చేస్తామని చెప్పడంతో కొన్ని సలహాలను, నియమాలను తెలిపారు.

హంపిలో హోలీ సంబరాలు



హోలీ సంబరాల్లో విదేశీయులు, స్థానికులు

బళ్లారి సిటీ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కామదహనం జరిగిన పురాణ పవిత్ర ప్రదేశమైన హంపిలోని విరూపాక్ష ఆలయం ముందు శనివారం వందలాది మంది విదేశీయుల సహా వేలాది మంది హోలీ సంబరాలు జరుపుకున్నారు. జాతి మత బేధం లేకుండా విదేశీయులు కూడా రంగుల వేడుకలో ఉత్సాహంగా పాల్గొన్నారు. విదేశీయులతో పాటు సమీప గ్రామాల ప్రజలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘగనలు జరగకుండా పోలీసులు భద్రతను పెంచారు. మహిళలు ప్రత్యేక ప్రదేశంలో సంబరాలు జరుపుకోవడానికి ఏర్పాట్లు చేశారు.



ఉత్సాహంగా సెల్ఫీలు..

కంప్లి, (ఆంధ్రజ్యోతి) : గ్రామం పట్టణాల్లో శనివారం హోలీ సంబరాలు కనిపించాయి. బళ్లారి, విజయనగర జిల్లాల్లో హోలీ పండుగలు జోరుగా జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు.



హోస్పేట వద్ద చిన్నారుల సందడి

హోసూరు జోన్

అభివృద్ధి పనుల కోసం బూత్‌కమిటీలు



నియామక పత్రాలు అందజేస్తున్న పార్టీ ఇన్‌చార్జ్ పన్నీర్ సెల్వం

హోసూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి పశ్చిమ జిల్లా అన్నాడీఎంకే పార్టీ అభివృద్ధి పనుల్లో వేగం పెంచేందుకు అన్నాడీఎంకే బూత్ కమిటీ ఏర్పాటుకు ఇన్‌చార్జ్‌గా పన్నీర్‌సెల్వంను నియమించారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి కృష్ణగిరి పశ్చిమ జిల్లా పరిధిలోని హోసూరు, తళి, వేపనపల్లి మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అన్నాడీఎంకే సంఘాలు బూత్ కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో అన్నాడీఎంకే యూనియన్ల వారీగా నియమించిన బూత్ కమిటీ పదాధికారులతో పన్నీర్‌సెల్వం నేరుగా సమావేశమై సలహా సూచనలు చేశారు. హోసూరు కార్పొరేషన్ తూర్పు ప్రాంతంలో అన్నాడీఎంకే తరఫున బూత్ కమిటీ కార్యవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి కృష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి, మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. బంధువులుకూడా చేయ్యలేని కూడా ఎన్నో పథకాలను 'అమ్మ' మాజీ సీఎం జయలలిత అమలు చేశారన్నారు. పెళ్లి కోసం, బాలింతలకు కిట్టు బాక్సులు, అలాగే ఇద్దరు ఆడపిల్లలు ఉన్న వారికి రుణ సహాయం, ఇలా ఎన్నెన్నో పథకాలు తీసుకొచ్చిన ఘనత అమ్మకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు, వాసుదేవన్, అశోక్‌రెడ్డి, హోసూరు కౌన్సిలర్లు, లక్ష్మీహేమకుమార్, దిల్షాట్ రహమాన్, నటరాజ్, జిల్లా ప్రతినిధి లక్ష్మణ్, మైనార్టీ డివిజన్ జిల్లా అధికారి ముబారక్, సర్కిల్ కార్యదర్శి సూడప్ప, ప్రాంతీయ నిర్వాహకులు సామినాథన్ , చంద్రూతో పాటు పలువురు పాల్గొన్నారు.

రైతు కష్టం నేలపాలు..

● ధరలు లేక టమోటాను పారబోస్తున్న అన్నదాతలు

హోసూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): హోసూరు, బాగలూరు, బేరికై, కెలమంగలం దాని పరిసర ప్రాంతాల్లో 3 వేల ఎకరాలకు పైగా టమోటా సాగు చేస్తున్నారు. ఈ ఏడాది కిలో రూ.3కే పలకడంతో గిట్టుబాటు ధర లభించకపోవడంతో పంటను నేలపాలు చేశారు. గత ఏడాది గరిష్ఠంగా రూ.150వరకు పలికింది. ఈ సంవత్సరం ప్రారంభంలో కిలో టమోటా రూ.70 వరకు ఉండేది. ధర పెరగడంతో వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి టమోటా కొనుగోలు చేసి హోసూరుకు తెప్పించారు. క్రమేపీ ధర కిలో రూ.25-30కు తగ్గింది. స్థానికంగా దిగుబడి పెరగడంతో టమోటా ధర కిలో రూ.8నుంచి 15వరకు తగ్గింది. టమోటాకు స్థిరమైన ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.



నేలపాలైన టమోటా

పట్టణంలో చెత్త తొలగింపు

హోసూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): హోసూరు చంద్రచూడేశ్వర ఆలయ రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ రథోత్సవం సందర్భంగా భారీగా చెత్త ఏర్పడింది. శనివారం ఒక్క రోజే కొండపై 65 టన్నుల చెత్తను తొలగించారు.. సాధారణంగా హోసూరు మొత్తం ప్రతి రోజూ 140 టన్నుల చెత్త సేకరిస్తారు. రథోత్సవానికి తమిళనాడు నుంచి మాత్రమే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా ఎక్కువ మంది భక్తాదులు పాల్గొన్నారు. 500కు పైగా వివిధ చోట్లలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పుచ్చకాయలు, వడపప్పు, పానకం, మజ్జిగ, వివిధ రకాల అన్నదానాలు చేశారు. అదే విధంగా ఎంజీ రోడ్డు, నేతాజీ రోడ్డు, తాలూకా కార్యాలయం రోడ్డు, 240కు పైగా స్వచ్ఛతా సిబ్బందిని ఏర్పాటు చేశారు. రాత్రింబవళ్లు పని చేస్తున్నారు. సాధారణంగానే రోజుకు 140 టన్నుల చెత్త సేకరిస్తారు. అదే విధంగా రథోత్సవం నేపథ్యంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర వ్యర్థాలను 65 టన్నుల చెత్తను ఆహార పదార్థాలను మైక్రో కంపోస్టింగ్ వ్యర్థాలుగా వేరు చేసి ఆనంద్‌నగర్ లోని మైక్రో కంపోస్టింగ్ కేంద్రానికి తరలించారు. గతేడాది రథోత్సవంలో 22 టన్నుల చెత్త సేకరించగా ఈసారి ఎక్కువ చెత్త సేకరించామని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తెలిపారు.



చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నీట మునిగి విద్యార్థి మృతి

హోసూరు (క్రైం), మార్చి 15 (ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపాన బత్తలపల్లికి చెందిన పాఠశాల విద్యార్థులు మోర్నపల్లి గ్రామంలోని పాతచెరువులో స్నానానికి వెళ్లారు. వేసవితాపం కావడంతో చెరువులో ఈతకు దిగిన ఆరో తరగతి చదువుతున్న హర్షిత్ విద్యార్థి లోతైన ప్రాంతంలో మునిగి మృత్యువాత చెందాడు. సమాచారం అందుకున్న విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు అక్కడికి చేరుకున్నారు. హడ్కో పోలీసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఎట్టకేలకు బాలుడి మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం హోసూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

స్నానానికి వెళ్లి కాలువలో యువకుడి గల్లంతు

రాయచూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : హోలి పండుగ సందర్భంగా పండుగ ముగించుకుని స్నానం కోసం కాల్వకు వెళ్లిన యువకుడు నీటి ప్రభావంతో కొట్టుకుపోయాడు. ఈ సంఘటన శనివారం ఉదయం జిల్లా సరిహద్దు గిల్లేసుగూరు వద్ద తుంగభద్ర కాలువలో చోటు చేసుకుంది. గల్లంతైన యువకుడు యరగేరాలో కిరాణ దుకాణానికి చెందిన మహాదేవ్‌గా గుర్తించారు. స్నేహితులతో కలిసి హోలి జరుపుకున్న మహాదేవ్(30) స్నానం చేసేందుకు కాలువకు వెళ్లగా కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ఈత రాకపోవడం వల్ల కొట్టుకుపోయినట్లు స్నేహితులు వివరించారు. యువకుడు నీటిలో కొట్టుకుపోగా మృత్యువాత పడి తెలంగాణ సరిహద్దులో శవాన్ని గుర్తించినట్లు స్థానికులకు సమాచారం అందింది. ఈ సంఘటనకు సంబంధించి ఇడపనూరు పోలీసులు కేసు నమోదు చేశారు.



మహాదేవ్(ఫైల్)

పట్ట పగలే వ్యక్తి హత్య

రాయచూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని భంగికుంటా వద్ద శనివారం సాయంత్రం పట్ట పగలే అందరూ చూస్తుండగానే వ్యక్తి ఒకరు హత్యకు గురైయ్యాడు. మృతుడు నగరానికి చెందిన బబ్లు అలియాస్ ఖదీర్ అలియాస్ బబ్లూ(35)గా గుర్తించారు. భంగికుంటా ఎదురుగా నిలిచి ఉన్న బబ్లూను ప్రత్యర్థులు అకస్మాత్తుగా వచ్చి దాడి చేసి చాకుతో పొలవడంతో తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న సదర్ బజార్ పోలీసులు అక్కడికి చేరుకోగా కుటుంబ సభ్యుల సహాయంతో చికిత్స కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బబ్లూ మృత్యువాతపడ్డాడు. ఇటీవల తెలంగాణలోని గట్టు మాచర్ల సమీపంలో జరిగిన ఒక హత్యకు సంబంధించి బబ్లూపై ఉన్న కక్షల కారణంగానే ఈ హత్య జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ సత్యనారాయణ సదర్ బజార్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఉమేశ్ కాంబ్లెలు పరిశీలించి కేసు నమోదు చేశారు.



బబ్లూ (ఫైల్)